# బ్రతుకుల బరువు

శ్రీ [illegible]
[illegible] నరసింహా రావు

వాకిట్లోనుంచి వస్తూనే చిట్టేడీ అంటూ ఆదుర్దాగా చెప్పులు కాస్త విడిచి గబగబ గదిలోకి నడిచింది వసంత.

ఇందాకటినుంచి యేడ్చి యేడ్చి యిప్పుడే నిద్రపో యాడు అన్నాడు మధు. చిట్టి వంటిమీద దుప్పటి సరిచేస్తూ.

"అప్పుడే మీరు పాలు పట్టలేదన్నమాట!" యేమిటో అనబోయింది వసంత.

"అంతమాత్రం తెలుసుగాని యింతసే పయిందేం ?" మొహం చిట చిట లాడించాడు మధు.

"మా మేనేజర్ని వెయ్యండి ఆ ప్రశ్న. నన్నడుగుతే?"

"నువ్వు యిచ్చేజవాబుల్లో యిదికూడా వకటి అని నాకు తెలుసు. ఉద్యోగం చేస్తూండగానే సరికాదు. దానికి తగ్గ వినయ విధేయతలుకూడా వుండాలి" సగంలోనే ఆపె య్యాలసి వచ్చింది మధు.

"అదేమిటో వుద్యోగం లేకుండా కూర్చున్న మీ దగ్గరనుంచి నేర్చుకోనక్కర్లేదులెండి!" వసంత లోపలికి వెళ్ళిపోయింది.

మధు మనస్సుని మధనం చేసినాయి ఆ మాటలు. కాని తన కోపాన్ని యేవిధంగా చూపించగలుగుతాడు. పళ్ళు పటపట మనిపించి వీధి గుమ్మం దాటేశాడు.

ప్రజాస్వామ్య యుగంలో నిరుద్యోగ సమస్య హెచ్చి పోతున్నకొద్దీ, ప్రణాళికలమీద ప్రణాళికలు ఢిల్లీలో తయారుచేస్తున్నా, మధుకు మాత్రం తెగిన జోడు వదిలే టట్లు లేదు.

మధు బి.ఏ లో ఉండగా వసంత మెట్రిక్యులేషన్ చదువుతూవుండేది మధుకు సంబంధాలమీద సంబంధాలు వచ్చి పడుతూవుండేవి. కట్నం చాల దనో, పిల్ల బాగుండ లేదనో, చదువుకున్నది కాదనో యెంతో మంది ఆడ వాళ్ళను అవమానపరిచి పంపించేశేవాడు. అప్పటికీ యేదోవిధంగా మధును తృప్తిపరుద్దామని ప్రయత్నాలు చేసినా, వసంత తల్లిదండ్రులకు మాత్రం మధు మీద కన్ను ఉండనే ఉంది. ఊళ్ళో వసేను. బి.ఏ. ప్యాసయిన తరవాత ఉద్యోగం కుదిరే కూర్చుంటాడు కనుకనా, ఏదో రోజుపాటి యిల్లుకూడా ఉందేను. మన అమ్మాయికి తక్క అవుతే బాగుండునని అనుకున్నారు. వసంతను చూసినప్పటి నుంచి, మధుకు మిగతా విషయాలమీద వున్నదంత చూపించాలని మనస్సుపోవట లేదు. అయితే అతనికోరికమాత్రం కనీసం మెట్రిక్యులేషన్ ప్యాసయిన అమ్మాయి తన భార్యగా ఉంటే బాగుంటుందని దాహంకూడా ఎక్కువగా ఉంది. ఏమాత్రం మధు మొత్తపడుతున్నాడని, వసంత తల్లి దండ్రులకు తెలిసినా. కట్నం తగ్గించేస్తారని మధుకు తెలుసు. అందు వలన ఉపాయంగా యెక్కడో సంబంధం వచ్చినట్లు. కట్నం పుష్కలంగా యిస్తామన్నట్లు, మధుకు కూడా అంగీకారంగా ఉన్నట్లు ఒక పుకారు లేవదీసి ఉంచాడు. వసంత తల్లితండ్రులు దాంతో మూడు వేల కట్నానికి వప్పుకున్నారు. విధిలేక, వసంతకు మాత్రం పెద్ద తల వంపులుగాపుంది. అయినా ఆడది యేంచేస్తుంది. మెట్రిక్యు లేషన్ అయిన తర్వాత పై చదువు చదువుకునే యోగ్యత వసంతకు లేదు. ఎట్లావచ్చి, తర్వాతైనా ఎవరికో వకరికి భార్యగా అవటమేగా పరమార్థం. వసంత వూహలు, ఆమె కోర్కెలు, ఆమె ఆశయాలకు, అన్నింటికివిరుద్ధం గానే తన వివాహం జరిగిపోతుందని వసంతకు తెలుసు. వసంత మెట్రిక్యులేషన్ ప్యాసయితేనే చేసుకుంటాడని మధుదగ్గరనుంచి కబురువచ్చిననాడు మాత్రం, వసంత ఆగ్రహం పట్టలేకపోయింది. వసంత తల్లి దండ్రులు మాత్రం వెయ్యి దేవుళ్ళకు మ్రొక్కుకున్నారు. ఏట్లాగైనా తన కూతురు పరీక్ష ప్యాసయితే బాగుండునని. అమ్మా! నేను మీకు అంతబరువైతే, నాబ్రతుకు నేను బ్రతకగలను గాని, నన్ను యిట్లా అవమానం చేసి హింసించి. నాకు పెళ్ళిచేస్తే. నాకు మాత్రం యేం సుఖంవుంటుంది· అంటూ బావురుమని యేడ్చింది వసంత చేసేదేంలేక.

"పెచ్చిపిల్లా! నీ కేంతెలీను. దీంట్లో నిన్ను హింసించటం యేముంది. చెప్పు....నీ బాగుకోసేనా, తల తాకట్టు పెట్టి

మూడువేల కట్నానికి ఒప్పుకున్నాం.... ఇద్దరూ మాతుర్ని శాంతపరచటానికి ప్రయత్నం చేశారు.

తల్లిదండ్రుల అమాయకత్వానికి వసంత, కూతురి అమాయకత్వానికి తల్లిదండ్రులు మనస్సులో బాధపడ్డారు. వసంత యింక యేవిధంగా నచ్చ చెప్పాలన్నా, వాళ్ళకు అర్థంకాదని, ఆమెకు గట్టినమ్మకం యేర్పడి పోయింది. మధుకుభార్యగాఅయిపోయింది. వసంత పరీక్షప్యాసవటం ఒకషరతుగాని, మధు పరీక్ష విషయం షరతు పెట్టే ధైర్యం యెవరికుంది? అయినా మూడుపార్టులూ మూడేళ్ళు తీసుకుంటాడని యెవరికి తెలుసు. ఆ పసుపు గుడ్డలతో యిద్దర్నీ చూస్తుంటే యీడుజోడు అందం, చందం అందరికీ కన్నుకుట్టుగానే వున్నారు అని అనుకున్నారు.

కాపరానికి వచ్చిన తర్వాత కూడా వసంత కొన్ని నియమాలతో వుండిపోవాలని అభిప్రాయపడింది. భర్తకు ఉద్యోగం రావటంలేదని వసంత తెలుసుకుంటున్నప్పుడు, తనకు ఉద్యోగం దొరికితే బాగుండునని అనుకున్నది. ఒకనాడు సాహసించి మధుతో కూడ తన అభిప్రాయం చెప్పేసింది. కస్సుమంటూ లేచాడు! నువ్వుకూడా ఉద్యోగం చేస్తావన్నమాట. ఇందుకేనా పెళ్ళిచేసుకుంది. సిగ్గు ఉండక్కర్లా, ఏమొహంపెట్టుకుని ఆమాటన్నావు. ఆడదానివి ఆఫీసుకు వెళ్ళి కూర్చుంటావు!" మధు అన్నమాటలు వసంత హృదయాన్ని ముక్కలు ముక్కలుగా చేసినాయి. మనస్సు క్షోభపడి పోయింది. ఏ మాత్రం ఆత్మగౌరవం ఉన్నవాళ్ళయినా ఆ మాటలు భరించి జీవించటం కష్టమే అనిఅనుకున్నది. అయితే వసంతకు ఆత్మగౌరవం కంటే ఆత్మ విశ్వాసం యెక్కువ వుంది. అన్నీ భరిస్తూ, సమయంకోసం నిరీక్షిస్తున్నట్లు వసంత కాలం గడుపుతోంది. సంతానం విషయంలోకూడా వసంతకు నిశ్చితాభిప్రాయం వుంది. సంపాదనలేందే, సంతానం కనక కలుగుతే, పోషించటం కష్టమని, మధుకు యెన్నో తడవలు నచ్చ చెప్పటానికి ప్రయత్నం చేసింది. మధుకు, ఆమె అభిప్రాయాలు ఏ మాత్రం నచ్చలేదు. మొదటి పురుడు ఆసుపత్రిలోనే పోసుకుంది. పుట్టిన పిల్ల చచ్చిపోవటానికి మధు కారణమని, నర్సులు అనుకుంటున్న సంభాషణ విన్నప్పుడు, వసంత హృదయం పరితపించి పోయింది.

ఇక తాను ఉద్యోగం చెయ్యవలసిన అవసర మెంతైనా ఉందని, వసంత పట్టు పట్టింది. మధు వదిలేస్తానని బెదరించాడు కూడా. లొంగుతున్న గాఢీ లొంగ తీద్దామనే పురుషుల మనస్తత్వం వసంతకు బాగా అర్థమయిందని పించింది. అందులో మధు తత్వం, వసంత మొదటి నుంచి గమనిస్తూనే ఉంది. సాహసించి పందరూపాయలు వచ్చే ఒక గుమస్తా పనికి ఒప్పుకున్నది వసంత. తనకెంతో తలవంపులుగా ఉందని మధు రెండుమూడు రోజుల దాకా యింటికికూడా రాలేదు. తర్వాత తర్వాత, వసంత యేదైనా పలకరిస్తుందేమోనని అనేకసార్లు మధు ప్రయత్నం చేశాడు. సాధ్యమైనంత వరకు ముభావంగానేవుండి పోయింది. వసంత. మధుకుఅహంకారం పెరిగిపోతోంది ఏమాటఅన్నా, నెగ్గించుకునే స్థితి దాటిపోయిందని మధుకు యిప్పుడిప్పుడే తెలిసివస్తోంది. ఎట్లాగైనా బింకంగా వున్న వసంతను లోబరుచుకున్నాననే తృప్తిమాత్రం. మధుకు కలిగేట్లు చేసింది వసంత. ఒక షరతు పెట్టుతూ. తన వుద్యోగం సంగతి యేమీ మాట్లాడకూడదని. మధుకూడ తటస్థంగా అంగీకరించాడు. ఈసారి పురిటికి మాత్రం పుట్టింటికి వెళ్ళింది. మధుకూడా తలుపు తాళంవేసి తన యింటికి వెళ్ళిపోయాడు. ఈ నాలుగునెలల్లో, మధు వంటరిగా కూర్చుని ఆలోచిస్తూఉంటే. గతస్మృతుల్లో. అతనికి నచ్చినవి ఒక్కటీ గుర్తుకురావటంలేదు. తనభార్య తనకు సంపాదించి పెడుతోంది అనేభావము. అతని ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టి నట్లనిపించింది. అయితే చేసేదేమీలేదు ఉద్యోగం దొరికే సావకాశం యేమీ కనిపించటంలేదు.

మళ్ళీ కాపరానికి వసంత వచ్చే నాలుగు రోజులు ముందే, మధు యింటికి చేరుకున్నాడు. ఈసారి వసంత చిట్టినికూడా తీసుకువచ్చింది. ఒంటిగంటకు ఒకసారివచ్చి చూసిపోతుంది. మళ్ళీ సాయంత్రం అయిదు కాగానే. యింట్లోకి వచ్చి పడుతుంది వసంత. ఈలోగా చిట్టి విషయం అంతా మధే చూస్తూ వుంటాడు. రాను రాను మధు చేతిలో రాగిపైసకూడా లేకుండా పోతోంది. భార్యను అడగటానికి నామర్దాగావుంది. అయితే తన విషయం తెలిసి వసంతే యెప్పుడోవకప్పుడు తాను అడగకుండానే డబ్బుయిస్తుందని మధుకు నమ్మకంకూడా వుంది. అయితే ఆ ఘడియ యెప్పుడు వస్తుందా అనే ప్రతీక్షణే మధు ఆలోచన.

ఆనాడు సాయంత్రం, వసంత. చిట్టినిఆడిస్తూ సావిట్లో కూర్చుంది. ఎదురుగుండా కుర్చీలో కూర్చున్నాడు మధు. రెండుమూడు సార్లు మధు చూడకుండా. మధు మొహం

వంత యూరుమని ప్రయత్నం చేసింది వసంత. మధుకూడా ఆలోచనలో ఉన్నాడు ముందర యెవరు మాట్లాడాలా అనే సమస్య జటిలమయింది మధు యొక్క సహనం అంతమైపోతోంది. వసంత నిబ్బరంగా కూర్చుని ఉంది.

"బియ్యం నిండుకున్నాయి తెలుసా" గట్టిగా అరచాడు మధు.

"ఈ అయిదు రూపాయలుపెట్టి తీసుకురండి" ముభావంగా ఒక నోటు అందిచ్చింది. మధు చెయ్యికూడా వెనక్కు వెనక్కు జంకుతూనే ముందుకు సాగింది. తన అభిమానం బాగా దెబ్బ తిన్నదనుకున్నాడు మధు. నిజం చెప్పేస్తే, మరింత అవమానం. తనకోసం డబ్బు అడగటానికి అభిమానం పూర్తిగా అడ్డు వచ్చేసింది. చివాలున కుర్చీలోంచి లేచాడు.

"బియ్యం తీసుకురండి .... మీ జేబులో యిందాక అయిదు రూపాయలు పెట్టాను చూడరా .." నవ్వు ఆపుకోలేకపోయింది వసంత.

తాను, వసంత నవ్వు చూడనట్లు ప్రవర్తించాలని చివాలున వాకిట్లోకి వెళ్ళిపోయాడు. బజార్లోకి వెళ్ళాడే కాని తన హృదయం అంతా కలవరపెట్టేసింది. వసంత అన్న "బియ్యమే తీసుకురండి" అన్నమాటఅర్థం మధుకు చాలావికటంగా స్ఫురిస్తోంది. ఏదైనాచెయ్యటమా, ఏదైనా చేసుకోవటమా అనే ఆలోచన తన మెదడులోకి క్షణంలో వచ్చి యెగిరిపోయింది. ఇంటికి వచ్చి ఆనాడు సరిగా అన్నం తినలేదు. వసంత ఒక్కసారి మాత్రం అట్లావున్నారే అని వూరుకుంది. వసంత యింకాయేవేవో అడగాలని మధుకువుంది. కాని సావకాశం యేమి యివ్వలేదు. మధు శరీరం అంతా తగలబడి పోతున్నట్లుంది. వసంత చూచీ చూడనట్లు ఊరుకుంది.

పండగనాడు వసంత తనకోసం బుష్షర్టు, పాంటు తీసుకు రావటం యేమాత్రం యిష్టంలేదు మధుకు. తనకు యిష్టమైన పిండివంటలు చెయ్యటం అంతకంటే యిష్టంలేదు. తనకోసం ఆమె వేచియుండటం. మధుకు సహించరానిదై పోయింది.

ఉద్యోగం కోసం వెళ్ళినవాణ్ణి వేళకురావటానికి వీలుంటుందా చెప్పు వసంత. నువ్వుకూడా నాకోసం... మాట వ్రాస్తున్నట్లు తాను తప్పిన గంగలోకి పెళ్ళయిందని మనసుగా పట్టుకున్నాడు మధు.

ఎంతో నిబ్బరమైంది వసంత మధువు అన్నానికి కూర్చుంటూ. హృదయంలో బాధగాయం పోతున్నదానిగ్ని ఒక్కసారిగా గుర్తుచేస్తున్నది.

"వసంతా నీమనస్సుతెలుసుకోలేక యెన్నో అన్నాను నిన్ను యెంతో హింసపెట్టాను. నేనేం చెప్పలేను నన్ను" ఏదో అనబోతున్న మధు నోటిని మూసేసింది వసంత. అనుకోకుండా వసంత కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగినాయి. నిబ్బరం చేసుకుని, "నేను మిమ్మల్ని కోరేదల్లా ఒకటే. నేనుకూడా మనిషినే, నన్నుఆవిధంగానే చూడండి. అంతకంటే యేంలేదు. ఇది మీ హృదయానికి తెలుస్తేచాలు. నన్ను క్షమాపణ కోరాలని కాదు నా పుద్దేశం"— ఇంకా యెక్కువ అనలేక పోయింది వసంత. మధు కూడా అక్కడ ఉండలేక పోయాడు.

మర్నాడు మధుకు ఇంటర్వ్యూ. ఈ సారి చాలా ధైర్యంగా ఉన్నాడు. తప్పక ఉద్యోగం వస్తుందనే నమ్మకం అతను చేసిన ప్రయత్నాల వలన కలిగింది. వసంత పుత్సాహంకూడా, మధును తృప్తిపరిచింది. ఆనాడు వసంత శలవు పెట్టింది. ఇంట్లోచిట్టిని ఆడిస్తూకూర్చుంది. రెండుగంటలు దాటేటప్పటికి, మధు అతి సంతోషంగా ఒక్క పరుగులో వచ్చిపడ్డాడు వసంత దగ్గరకు.

"వసంతా. నన్ను ఫస్టునుంచి జాయన్ అవమన్నాడు. ప్రస్తుతం నూటయేభై జీతం. ఏడాదయిన తర్వాత రెండు వందల గ్రేడులో తీసుకుంటారుట" అంటూ ఆర్డరు కాగితం వసంత చేతిలో పెట్టాడు.

"మా మామయ్య పలుకుబడికి తిరుగులేదని నేను చెప్పటంలే" వసంత గట్టిగా చిట్టిని ముద్దుపెట్టుకుంది.

"పోస్టు" అంటూ ఒక ఉత్తరం విసిరిపోయాడు. వసంత ఉత్తరాన్ని చదువుతూ విచారంగా. మధువైపుకు చూసింది.

"ఏమిటి వసంతా మీనాన్న దగ్గరనుంచి కార్డు" మధు ఆదుర్దాగా అడిగాడు.

"అవును మా నాన్నే వ్రాసింది. పాపం యేముంది సంపాదన ఉన్న యెకరన్నర నా పెళ్ళికి అమ్మేశాడు

ప్రయివేట్లమీద మేమొస్తుంది. ఒకపూట తిని ఒకపూట తినక ఎన్నో కష్టపడుతున్నానని వ్రాశాడు. మా అమ్మ నన్ను ఎట్లా పెంచింది.. యెంతచేసింది. ఆవేళ నా ముఖానే వాళ్ళకు యిచ్చేసి" వసంత మధుముఖము చూస్తూ చెప్తోంది.

మధు మనస్సు చాలా బాధపడింది. తన పెళ్ళి విషయాలు యేవేవో జ్ఞాపకంవచ్చి తన మనస్సును కలవర పెట్టినాయి. ఏదో ఒక ఆవేశం, మధును క్షణంలో ఆవహించింది.

"వసంతా నీవేమీ విచారపడకు, పైనెల నుంచి మీ నాన్నకు 'ముప్పయియాపాయలు పంపిస్తాను' మధు ఉత్సాహంగా వసంత కళ్ళలోకి చూశాడు.

కనురెప్పలు తుడుచు కుంటూ, కూతురి సొమ్ముని మానాన్న వప్పుకుంటాడా అని వసంత నీరసంగా అన్నది.

"వాళ్ళిచ్చిన కట్నం వాళ్ళకే యిచ్చేస్తాను. ఇది మన సొమ్ము క్రిందలెక్క" వప్పుదల కోసం ఆశగా మధు వసంత వంక చూశాడు.

పెదిమలమీదకు రానిచ్చిన వసంత చిరునవ్వే మధును సంతోషపెట్టింది.

పస్తుతారీఖు వచ్చి పడుతోంది. నిబ్బరంగా నిర్ణయం చేసుకోవలసిన సమయం వచ్చేస్తోంది.

ఆనాడు ఒంటరిగా గదిలో కూర్చున్న మధు దగ్గరకు వెళ్ళి "మీతో ఒకమాట చెప్పదామనుకుంటున్నా .... నేనూ మీరూ ఆఫీసులకు వెళ్ళి కూర్చుంటే చిట్టి సంగతి చూసే దెవరు...అందుకని మీకు ఉద్యోగం దొరికింది గదా.... మరి మాఘమాసం నాటికి చిట్టికి తమ్ముడో చెల్లెలో .... ఆపేసింది వసంత.

మధుకు పిచ్చెత్తినట్లయింది.

"చెల్లెలే.... ఒక మగపిల్లాడు ఒక ఆడపిల్ల"....

ఇద్దరూ ఒకళ్ళ మొహం ఒకరు చూసుకుని నవ్వుకున్నారు.

ఫస్టుతారీఖు వచ్చేసింది. గడియారం పదిగంటలుకూడా కొట్టేసింది.

గబగబ బూట్లు తొడుక్కుని చిట్టీంటూ గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు మధు.

హడావిడిగా వాకిట్లోకి వెళ్ళిపోతున్న మధును చూసి నాన్నా నాన్నా అంటూ తప్ప టడుగులు వేసుకుంటూ వస్తున్నాడు చిట్టి ప్రక్క సందులోంచి.


మిల్క్ ఆఫ్ మెగ్నీషియా
మరొక
ఐ.టి.ఎల్. ప్రాడక్టు

పైత్యహారి, విరేచనకారి

ఉత్పత్తిదారులు:
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లేబరేటరీ లిమిటెడ్.
మల్లేశ్వరం, బెంగుళూరు.




సేల్సు డిపార్టుమెంటు:
35/37, తంబుచెట్టీ స్ట్రీటు,
మద్రాసు 1.